క్లుప్తంగా

వరుసక్రమంలో నాట్లు



నాట్లు వేస్తున్న ఆర్‌టీఎల్ ప్రకాష్

విజయనగరం ఫోర్ట్: వరుసక్రమంలో వరి నాట్లు వేస్తే దుబ్బు శాతం పెరుగుతుందని రీజనల్ తెమెటిక్ లీడర్ ప్రకాష్ అన్నారు. ద్వారపూడి గ్రామంలో రైతులకు వరుస క్రమంలో వరి నాట్లు వేసే పద్ధతిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రమపద్ధతిలో నాట్లు వేయడం వల్ల పంటకు గాలి, వెలుతురు బాగా తగిలి దోమపోటు ఆశించదన్నారు. అలాగే నారు చివర్లు తుంచి నాటుకోవడం వల్ల తెగుళ్ల బెడద ఉండదని సూచించారు. కార్యక్రమంలో అనిత, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్ ఆకస్మిక పర్యటన



సచివాలయ కార్యదర్శిని హెచ్చరిస్తున్న కమిషనర్ మల్లయ్యనాయుడు

విజయనగరం: నగరంలోని 38, 39, 40 సచివాలయాల పరిధిలో కార్పొరేషన్ కమిషనర్ ఎం. మల్లయ్యనాయుడు శనివారం ఆకస్మికంగా పర్యటించి, పారిశుధ్య పనుల తీరును పరిశీలించారు. కొన్నిచోట్ల పారిశుధ్యం లోపించడంతో సిబ్బందిని మందలించారు. ఇంటింటి చెత్తసేకరణ ప్రతిరోజూ చేపట్టాలని సూచించారు. బాలాజీనగర్, తోటపాలెం, ప్రదీప్‌నగర్ ప్రాంతాలలో పర్యటించి నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను గమనించారు. కార్యక్రమంలో ఆయా సచివాలయాల పరిధిలోని పారిశుధ్య పర్యవేక్షకులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

కోలుకున్న డెంగీ రోగులు

- డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

సాక్షి ఎఫెక్ట్

విజయనగరం: విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్‌లో మూడు డెంగీ కేసులు నమోదు కాగా జ్వర పీడితులంతా కోలుకున్నారని జిల్లా వైద్యారోగ్యాధికారి ఎస్.భాస్కరరావు తెలిపారు. నగరంలో డెంగీ కలకలం శీర్షికతో జూలై 24న సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించి కోరాడవీధి, సాలిపేట, కాటవీధి ప్రాంతాల్లో ఇంటింటి ఫీవర్ సర్వే చేపట్టారు. అలాగే లార్వా నివారణ మందు పిచికారీ, ఫాగింగ్ చేపట్టారు. ఈ మేరకు డీఎంహెచ్‌ఓ భాస్కరరావు శనివారం స్పందిస్తూ, ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందిన వారు కూడా ఇళ్లకు చేరుకున్నారని, ప్రస్తుతం డెంగీ అదుపులో ఉందని చెప్పారు.

జాగ్రత్తగా ఉండాల్సిందే..

- ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనురాధ

విజయనగరం ఫోర్ట్: అమ్మాయిలు ప్రతి విషయంలో జాగ్రత్తగా ఉంటూ, సమాజంలో గౌరవంగా జీవించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనురాధ అన్నారు. శనివారం స్థానిక ఆర్‌కే డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ప్రత్యేక సదస్సులో ఆమె మాట్లాడుతూ, ఆత్మస్థైర్యంతో అమ్మాయిలు తనకు తాను రక్షించుకునే విధంగా ఉండాలని తెలిపారు. ప్రతి విద్యార్థీ మంచి ఆలోచనలు, మంచి ప్రవర్తన కలిగి ఉండాలని సూచించారు.

ఆడ పిల్లలకు రక్షణ కల్పించాలి

పూసపాటిరేగ : ఆడ పిల్లలకు రక్షణ కల్పించాలని సీడీపీఓ ఎస్తేరురాణి అన్నారు. మండలంలోని పేరాపురం అంగన్‌వాడీ కేంద్రంలో సఖి సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆడపిల్లలకు రక్షణ కల్పించడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. ఆడపిల్లల పట్ల తల్లిదండ్రులు బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు చిన్నమ్మలు, శకుంతల పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి కృషిచేయాలి

- తహసీల్దార్ ఎం. సురేష్



సమావేశంలో మాట్లాడుతన్న తహసీల్దార్ సురేష్

భోగాపురం: సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహిస్తూ మండల అభివృద్ధికి కృషి చేయాలని తహసీల్దార్ ఎం.సురేష్ అన్నారు. చీపురుపల్లి నుంచి బదిలీపై వచ్చిన ఆయన శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజలు తెలియజేసిన సమస్యలను వెంటవెంటనే పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా మండలంలో విమానాశ్రయ నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో ప్రతిఒక్కరూ తనకు అందుబాటులో ఉంటూ అడిగిన వెంటనే పూర్తి సమాచారం తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఎస్. శ్రీనివాసరావు, మండల సర్వేయర్ ముదికేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతరలోగా..

రహదారులకు మరమ్మతులు

- అన్ని రంగాల్లో నగర అభివృద్ధే పాలకవర్గం ధ్యేయం
- విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ విజయలక్ష్మి
- స్టాండింగ్ కమిటీ సమావేశంలో 43 అంశాలకు ఆమోదం



నగర మేయర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో స్టాండింగ్ కమిటీ సమావేశం

విజయనగరం: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి జాతర సమయానికి విజయనగరం జిల్లా కేంద్రంలోని అన్ని రహదారులకు మరమ్మతులు పూర్తి చేయాలని విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ వి.విజయలక్ష్మి ఆదేశించారు. అదేవిధంగా అమ్మవారి తెప్పోత్సవానికి సంబంధించి ర్యాంప్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. శనివారం సాయంత్రం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. మేయర్ విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో అజెండాలో పొందుపరిచిన 43 అంశాలకు కమిటీ ప్రతినిధులు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా నగర మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. అన్ని రంగాల్లో విజయనగరం అభివృద్ధే ధ్యేయంగా కార్పొరేషన్ పాలకవర్గం, అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు దెబ్బతిన్న రహదారుల మరమ్మతులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రజలంతా కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ శెట్టివీరవెంకట రాజేశ్వరరావు మాట్లాడుతూ, ఆగస్టు 15న ప్రభుత్వం ప్రారంభించనున్న అన్న క్యాంటీన్లను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేసేందుకు అధికారులు చొరవ చూపాలన్నారు. సమావేశంలో కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు, అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు, కమిటీ సభ్యులు పట్నాన పైడిరాజు, బోనెల ధనలక్ష్మి, పిన్నింటి కళావతి, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



హాజరైన కార్పొరేషన్ అధికారులు, సభ్యులు

దివ్యాంగులకు సేవ చేయడం అదృష్టం



పంపిణీ చేసిన దుస్తులతో పాఠశాల విద్యార్థులు

విజయనగరం: దివ్యాంగుల సేవ దేవుని సేవగా భావించాలని విశాఖకు చెందిన సీనియర్ డాక్యుమెంట్ రైటర్ ఎం.శ్రీమన్నారాయణ అన్నారు. విజయనగరం పట్టణంలోని వైష్ణవవీధిలో ఉన్న పేర్లవారి చెవిటి, మూగ పాఠశాలలో దివ్యాంగ విద్యార్థులకు వైశాఖి దివ్యాంగ సేవా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో యూనిఫారం, భోజన వితరణ కార్యక్రమం నిర్వహించారు. క్యారమ్స్, తదితర ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షుడు శ్రీమన్నారాయణ మాట్లాడుతూ, తమ సంస్థ ఆధ్వర్యంలో ప్రతినెలా ఉత్తరాంధ్ర పరిధిలో ఒక దివ్యాంగ విద్యార్థుల పాఠశాలకు వెళ్లి వారికి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి కె. సోమేశ్వరరావు, ఎం. లక్ష్మీనారాయణ, ప్రతినిధులు పి.బంగార్రాజు, జి. త్రినాథరావు, భాస్కర పట్నాయక్, జె. మాధవి, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



తహసీల్దార్ గోవింద్‌ను అభినందిస్తున్న సిబ్బంది

పూసపాటిరేగ: మండల తహసీల్దార్‌గా తాడ్డి గోవింద శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఇక్కడ పనిచేసిన ప్రవల్లిక ప్రియ శ్రీకాకుళం జిల్లాకు బదిలీపై వెళ్లారు. బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ గోవిందను డిప్యూటీ తహసీల్దార్ లావణ్య, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మాధురి, సర్వేయర్ గణపతిరావు, తదితరులు అభినందించారు.

డ్రగ్స్ నియంత్రణకు సహకరించాలి

- రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ అప్పారావు



సమావేశంలో మాట్లాడుతున్న అప్పారావు

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో డ్రగ్స్‌ను పూర్తి స్థాయిలో నియంత్రించడంలో కళాశాలల ప్రిన్సిపాళ్లు, వసతిగృహ సిబ్బంది కీలకపాత్ర పోషించాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ అప్పారావు పిలుపునిచ్చారు. నగరంలోని ధర్మపురి జంక్షన్‌లో గల అపెక్స్ కళాశాలలో 'బాలల హక్కుల పరిరక్షణ – డ్రగ్స్ నియంత్రణ' అనే అంశంపై ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో విద్యార్థులు, యువత చెడు అలవాట్లకు, మత్తు పదార్థాలకు అలవాటు పడి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు కమిషన్‌కు నివేదికలు అందుతున్నాయని తెలిపారు. కళాశాలలు, వసతిగృహాల్లో ప్రిన్సిపాళ్లు, సంబంధిత అధికారులు అందరూ ప్రహరీ క్లబ్‌లు ఏర్పాటు చేసి వాటిని బలోపేతం చేయాలని సూచించారు. బాలికల ఉన్నత పాఠశాలల్లో, వసతిగృహాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంక్షేమ కమిటీ అధ్యక్షుడు జి. హిమబిందు, ఇంటర్ మీడియట్ బోర్డు ప్రాంతీయ అధికారి మజ్జి ఆదినారాయణ, మిషన్ వాత్సల్య ప్రతినిధులు బి. రామకోటి, శిశుగృహ మేనేజర్ త్రివేణి, చైల్డ్‌లైన్ ప్రతినిధులు మీనా, గౌరి, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు అరకొర భోజనం..



చాలీచాలని కిచిడీ

విజయనగరం ఫోర్ట్: అంగన్‌వాడీ చిన్నారులకు పెట్టే భోజనంలో అంగన్‌వాడీ సిబ్బంది కోత విధిస్తున్నారు. దీంతో పిల్లలు కడుపు నిండా భోజనం చేయలేని పరిస్థితి. పూర్తి స్థాయిలో సరుకులు ఉన్నప్పటికీ పిల్లలకు సరిపడా భోజనం వండడం లేదు. విజయనగరంలోని పోలయ్యపేట అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పిల్లలకు సరిపడా భోజనం వండలేదు. మెనూ ప్రకారం కిచెడీ పెట్టాలి. కేంద్రానికి 11 మంది హాజరైతే కనీసం ఐదుగురికి కూడా సరిపోయే కిచిడీ వండలేదు. ఈ విషయాన్ని సీడీపీఓ గులిపల్లి ప్రసన్న వద్ద సాక్షి ప్రస్తావించగా.. పిల్లలకు పూర్తి స్థాయిలో భోజనం పెట్టాలని తెలిపారు. విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

ఫిట్‌నెస్ లేని బస్సులను సీజ్ చేయాలి

- ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట అప్పన్న



మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ నాయకులు

విజయనగరం ఫూల్‌బాగ్: ఫిట్‌నెస్ లేని బస్సులను సీజ్ చేయడంతో పాటు నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బూర వాసు, కోట అప్పన్న డిమాండ్ చేశారు. శనివారం స్థానిక అమర్‌భవన్‌లో వారు విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రైవేట్ బస్సుల దోపిడి నానాటికీ పెరుగుతోందన్నారు. ప్రైవేట్ ట్రావెల్స్ ఆపరేటర్లు డిమాండ్‌ను బట్టి టికెట్ల ధరలు పెంచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, రవాణా శాఖ అధికారుల చర్యలు తీసుకోని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు వెలగాడ రాజేష్ పాల్గొన్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

- సర్వశిక్షా సీఎంఓ ఆదినారాయణ



డెంకాడ: పినతాడివాడ యూపీ పాఠశాలలో విద్యార్థులతో మొక్కలు నాటిస్తున్న సర్వశిక్షా సీఎంఓ ఆదినారాయణ, తదితరులు

డెంకాడ: మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని సర్వశిక్షా సీఎంఓ ఆదినారాయణ పిలుపునిచ్చారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పినతాడివాడ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం 'మా కే నామ్ పర్ పేడ్ – మదర్ గార్డెన్'లో భాగంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థీ మొక్కలు నాటి సంరక్షిస్తే సమాజానికి ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఏఎంఓ ప్రసాద్, సహాయ జీసీడీఓ గాయత్రి, ఎస్‌ఓ సూర్యారావు, ఎంఈఓ-2 శ్రీరామ్, హెచ్‌ఎం రాజశేఖర్, ఎంఈఓ కార్యాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడాలి..

పూసపాటిరేగ : మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని సర్పంచ్ ఎస్. సత్తిబాబు అన్నారు. కొత్తకొప్పెర్ల గ్రామంలో ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కలు విరివిగా నాటడం వల్ల పర్యావరణ సమతుల్యత ఏర్పడి వర్షాలు పడతాయని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరావుతో పాటు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కొంగవానిపాలెంలో..

భోగాపురం: మండలంలోని కొంగవానిపాలెం జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎకో క్లబ్‌లను ఏర్పాటు చేశారు. పాఠశాల ఆవరణలో 40 మొక్కలు నాటి అమ్మవనం పేరుతో అమ్మకు అంకితం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఆళ్ల వెంకటేష్, పి. శివప్రసాద్, విద్యార్థుల తల్లులు పాల్గొన్నారు.



పూసపాటిరేగ : కొప్పెర్లలో మొక్కలు నాటుతున్న సర్పంచ్ సత్తిబాబు, తదితరులు



భోగాపురం: పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు, తల్లులు, ఉపాధ్యాయులు

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు

- కార్పొరేషన్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు



హాజరైన సచివాలయ కార్యదర్శులు, పారిశుధ్య పర్యవేక్షకులు



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ మల్లయ్యనాయుడు

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందుస్తు చర్యలు చేపట్టాలని కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు ఆదేశించారు. ఈ మేరకు ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని పారిశుధ్య పర్యవేక్షకులు, కార్యదర్శులకు స్పష్టం చేశారు. శనివారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో పారిశుధ్య పర్యవేక్షకులు, కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నగరంలో గుర్తించిన లోతట్టు ప్రాంతాలు, కుంటలు, చెరువులు, నీరు నిల్వ ఉన్న ప్రాంతాలలో యాంటీ లార్వా ఆపరేషన్ మరింత ముమ్మరం చేయాలన్నారు . ప్రస్తుతం కాలానుగుణ వ్యాధులు ప్రబలే కాలం కావడంతో మరింత అప్రమత్తంగా ఉండి నిరంతరం పారిశుధ్య పనులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కొంతమంది కార్యదర్శులు విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్నట్లు ప్రజల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. ఇప్పటికై నా వారు తమ తప్పులను సరిదిద్దుకోవాలని సూచించారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు, ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తి, పారిశుధ్య పర్యవేక్షకులు పాల్గొన్నారు.

ధర్నాలను విజయవంతం చేయండి



ఎన్నికైన సహారా బాధితుల పోరాట నూతన కమిటీ

విజయనగరం ఫూల్‌బాగ్: సహారా ఇండియా బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ ఈ నెల 29న నియోజవర్గ కేంద్రాల్లో జరిగే ధర్నాల్లో బాధితులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పోరాట కమిటీ సలహాదారు టి. సూర్యనారాయణ పిలుపునిచ్చారు. తోటపాలెం ఎల్‌బీజీ భవన్‌లో శనివారం 20 మంది సభ్యులతో సహారా బాధితుల పోరాట కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా బీఎల్ దాస్, జనరల్ సెక్రెటరీగా ఎం.సూరిబాబు, గౌరవ సలహాదారుగా టి. సూర్యనారాయణ, గౌరవ అధ్యక్షుడిగా కె.సురేష్, వైస్ ప్రెసిడెంట్లుగా ఎస్‌ఎం నాయుడు, ఎస్‌ఏ ఖాన్, జి.అన్నాజీరావు.. జాయింట్ సెక్రెటరీలుగా ఎ.శ్రీనివాసుబాబు, కె..మోహనరావు, ఎ.బాలకృష్ణ, కోశాధికారిగా పి.సాయికృష్ణ, కమిటీ సభ్యులుగా కె.ప్రకాష్ వి.కుమార్, నర్సింగరావు, జీఎల్ నారాయణ, వైఏ నాయుడు, వి.శ్రీనివాసరావు, ఐఎస్ నాయుడు, ఎస్‌వీ రమణ, ఎం.రాజశేఖర్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కె. సురేష్, బి.లక్ష్మీదాస్‌లతో కలిసి తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ.. సహారా ఇండియా సంస్థ పేద ప్రజల నుంచి లక్షల కోట్ల రూపాయలను డిపాజిట్ల రూపంలో వసూలు చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం కలుగజేసుకుని దేశవ్యాప్తంగా 13 కోట్ల మంది బాధితులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఏ ఖాన్, ఎస్‌ఎం నాయుడు, కుమార్ ఎస్వీ రమణ, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



పైడినాయుడు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు, తదితరులు

నెల్లిమర్ల రూరల్: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, దివ్యాంగుల సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కల్యాణం పైడినాయుడు కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు శనివారం పరామర్శించారు. పైడినాయుడు ఇటీవల అనారోగ్యంతో కన్ను మూశారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్సీ జగ్గరాజుపేట గ్రామానికి వెళ్లి పైడినాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడి మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. కుటుంబానికి అన్ని విధాల అండగా నిలబడతామని భరోసా ఇచ్చారు. జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీలు పతివాడ సత్యనారాయణ, సారిక వైకుంఠంనాయుడు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి రేగాన శ్రీనివాసరావు, నాయకులు రాంబార్కి రామారావు, అట్టాడ కనకారావు, చనమల్లు తులసి, తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

వ్యర్థ జలాలను నియంత్రించాలి..

- ఎమ్మెల్యే లోకం నాగమాధవి



వ్యర్థజలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాధవి, తదితరులు

పూసపాటిరేగ: ప్రజా ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని, పరిశ్రమల నుంచి విడిచిపెడుతున్న వ్యర్థజలాలను తక్షణమే నియంత్రించాలని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. మండలంలోని ఎస్‌ఎంఎస్ పరిశ్రమ వ్యర్థజలాలను వర్షపు నీటితో కలిపి వదిలేస్తున్నారని గోవిందపురం సర్పంచ్ బాలా రామలక్ష్మితో పాటు రైతులు ఎమ్మెల్యే నాగమాధవికి శనివారం ఫిర్యాదు చేశారు. దీంతో ఆమె వ్యర్థజలాలను పరిశీలించారు. వ్యర్థజలాల వల్ల సాగునీటి కాలువల్లున్న మొక్కలు చనిపోవడంతో ఆశ్చర్యం వ్యక్తం చేశారు. వ్యర్థజలాలను వర్షపు నీటితో కలిపి బయటకు వదిలేస్తుండడపై కాలుష్య నియంత్రణ మండలి అధికారులతో మాట్లాడారు. పరిశ్రమ తీరు వల్ల ఈ ప్రాంతంలో గాలి, నీరు కలుషితమయ్యే ప్రమాదముందని, వెంటనే సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. ఆమెతో పాటు గోవిందపురం వైస్ సర్పంచ్ బాలా అప్పలరాజు, చల్లవానితోట మాజీ సర్పంచ్ పతివాడ శ్రీనివాసరావు, జి.శివ, బి.దుర్గ, తదితరులున్నారు.

బిందుసేద్యంతో నీరు ఆదా

- మైక్రో ఇరిగేషన్ పీడీ లక్ష్మీనారాయణ



డ్రిప్ ఇరిగేషన్‌పై రైతులకు అవగాహన కల్పిస్తున్న పీడీ లక్ష్మీనారాయణ, తదితరులు

పూసపాటిరేగ : బిందుసేద్యం ద్వారా నీరు ఆదా చేసుకోవచ్చని మైక్రో ఇరిగేషన్ పీడీ పీఎస్‌వీ లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని పతివాడ, కనిమెల్ల గ్రామాలలో ఏర్పాటు చేసిన డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రిప్ ఇరిగేషన్ పద్ధతిలో తక్కువ నీటితో ఎక్కువ సాగు జరుగుతోందన్నారు. ఎరువుల వినియోగం 90 శాతం వరకు తగ్గుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఏపీఎంఐపీ ఇంజినీర్ శ్రీనివాసరావు, సచివాలయం సిబ్బంది ప్రత్యూష, పార్థు, ప్రసన్న, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్‌ల కార్యవర్గాల ఎన్నిక



లయన్స్ స్టార్స్ క్లబ్ అధ్యక్షుడిగా ఎన్నికైన విష్ణుమూర్తికి బాధ్యతలు అప్పగిస్తున్న పూర్వగవర్నర్ శర్మ

చీపురుపల్లి: పట్టణంలోని లయన్స్‌క్లబ్ హాల్‌లో 2024–25 సంవత్సరానికి సంబంధించి లయన్స్ స్టార్స్ క్లబ్, లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గాల ఎన్నిక శుక్రవారం రాత్రి నిర్వహించారు. రెండు క్లబ్‌ల నూతన కార్యవర్గాలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. లయన్స్ స్టార్స్ క్లబ్ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన గంట్యాడ విష్ణుమూర్తి, కార్యదర్శిగా సూరు కిరణ్, కోశాధికారిగా విజనగిరి మహేష్, అలాగే లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా డి.సీతారామరాజు, కార్యదర్శిగా కోరాడ శంకరరావు, కోశాధికారిగా కంందుల నాగశంకర్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గంతో లయన్స్ క్లబ్ పూర్వ గవర్నర్, గరివిడి ఫేకర్ సీఈఓ ఎం.ఎస్.ఎస్.శర్మ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు విస్తరించాలని సూచించారు. యువత లయన్స్‌క్లబ్‌లోకి రావడం ద్వారా మంచి సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు అవకాశం ఉంటుందని, లయన్స్ క్లబ్ సభ్యత్వాలను వేగవంతం చేయాలని సూచించారు. క్లబ్ ప్రతినిధులు ఎస్.సన్యాసిరావు, ఎస్.వి.జి.శ్రీనివాసరావు, సూరు దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.